క్లుప్తంగా

టీటీడీ ఈఓతో తిరుపతి ఎంపీ భేటీ



టీటీడీ ఈఓ జె.శ్యామలరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ మద్దెల గురుమూర్తి

తిరుపతి(అలిపిరి): టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావును తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సోమవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి స్విమ్స్‌లో డీఆర్‌డీఓ– డెబెల్‌తో చేసుకున్న ఆధునాతన వైద్య పరిశోధన ఎంఓయూ, భారత రక్షణ పరిశోధన సంస్థ డీఆర్‌డీఓ–డెబెల్ ఎంఓయూను అమలు చేయాలని, డీఆర్‌ఎంఎల్‌తో ఇంప్లాంట్స్ తయారీకి ఎంఓయూ చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పేదలకు, శ్రీవారి భక్తులకు మరిన్ని అధునాతన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. విమానాశ్రయంలో శ్రీవాణి టిక్కెట్ కౌంటర్‌లో వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు విమానాల్లో వచ్చే భక్తుల కోసం కేటాయించాలని కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





ఆలయం వెలుపల గోవా స్పీకర్ రమేష్ తవాడ్కర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం గోవా స్పీకర్ రమేష్ తవాత్కర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అందరికీ అందుబాటులో ఉంటా..!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(అలిపిరి): ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని.. తిరుపతిలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక బైరాగి పట్టెడలోని వైఖానస మండపంలో కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు, ప్రజల సహకారంతో తిరుపతిలో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. కుట్రలకు పాల్పడిన వారికి త్వరలోనే శిక్ష తప్పదని.. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తిరుపతి ఎన్డీఏ కూటమిలోకి ఇతర పార్టీల వారు చేరాలంటే వార్డు, డివిజన్ స్థాయి నాయకులతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎన్డీఏ కూటమిలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు దేవనారాయణ రెడ్డి, కూటమి నాయకులు కిరణ్‌రాయల్, రాజారెడ్డి, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వర స్వామి సేవలో కలెక్టర్



చిత్రపటం అందజేస్తున్న అర్చకులు కార్తికేశన్

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామిని సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ప్రదోష మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలు అందించి స్వామి వారి చిత్ర పటం అందించారు. ఆయన వెంట సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ రెడ్డి, ఎస్ఐ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో జిల్లా కలెక్టర్

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు సాదరంగా ఆహ్వానం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. కల్యాణ వెంకటేశ్వరస్వామికి, పద్మావతి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలకు అర్చకులు ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట తహసీల్దార్ శంకర్, ఎంపీడీఓ కృష్ణమూర్తి ఉన్నారు.

యుగ పురుషుడు వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో..



కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు



కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



మంగళం బీటీఆర్ కాలనీలో ..

- పేదల గుండెల్లో వైఎస్సార్
- అన్నదాతల పాలిట ఆరాధ్యదైవం మహానేత
- వాడవాడలా వైఎస్సార్‌కు ఘన నివాళులు
- తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో మార్మోగిన వైఎస్సార్ అమర్ రహే నినాదం

తిరుపతి సిటీ: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సేవలు చిరస్మరణీయమని, ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న యుగపురుషుడని వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎం.ప్రేమ్‌కుమార్ కొనియాడారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతిని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ పద్మావతి మెడికల్ కళాశాల ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తెలుగు రాష్ట్రాల పేద ప్రజలకు ప్రాణాలు పోసిన మహానేత వైఎస్సార్ అన్నారు. అనంతరం రుయా, స్విమ్స్ ఆస్పత్రుల వద్ద సుమారు 150 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ముని, నరేష్, రూపేష్, మధు, సుధీర్, దినేష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేటలో..

భాకరాపేట: ప్రతి రైతు గుండెలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చిరస్థాయిగా నిలిచి ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా చిన్నగొట్టిగల్లు, తిప్పిరెడ్డిగారిపల్లె, రంగన్నగారిగడ్డ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బావాజీ, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, దినేష్‌రెడ్డి, ఖదీర్‌అహ్మద్, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మునిరాము, సుబ్రమణ్యం, లోకనాథరెడ్డి, మహేంద్రరెడ్డి, చెంగల్‌రెడ్డి, వెంకట్రామయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్సార్..

భాకరాపేట: ప్రతి పేదవాడి కుటుంబానికి భరోసా కల్పించిన నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని ఎర్రావారిపాళెం మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం ఎర్రావారిపాళెం, బోడేవాండ్లపల్లె, నెరబైలు జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంగళంలో ..

తిరుపతి మంగళం: మంగళంలోని సప్తగిరినగర్ గ్రామ పంచాయతీలో సోమవారం వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీల పార్టీ ఇన్‌చార్జ్‌లు లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతితో పాటు వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను సోమవారం మండలవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, పేదలకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిప్పిరెడ్డిగారిపల్లెలో..

తొండవాడలో..

మండల పరిధిలోని తొండవాడ పంచాయతీలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు వేడుకగా నిర్వహించారు. మహానేత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అలాగే మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన విగ్రహానికి గజమాల వేసి జోహారులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, సర్పంచులు కస్తూరి, గౌరీశంకర్‌రాజు, నాని, ఎంపీటీసీ శ్యామల, నాయకులు కపిలేశ్వర్‌రెడ్డి, మునీర్, గుండ్లూరి సురేష్, భాస్కర్‌నాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, పవన్‌కుమార్, రమేష్, జగన్నాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, అన్నాబాబు, వినాయక, గోపి, ఈశ్వర్, మధు, బేటా, సెంథిల్, హరీష్ పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న నాయకులు

తిరుచానూరులో..

చంద్రగిరి(తిరుచానూరు): రైతుబాంధవుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజన్న 75వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆలయ సమీపంలోని ఆర్‌కే కల్యాణ మండపం వద్ద సర్పంచ్ రామచంద్రారెడ్డి సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, చంద్రశేఖర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన నవశకానికి నాంది అని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నెన్నూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏపీ బ్రహ్మానందరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, నాయకులు జ్యోతి, సిద్దమునిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తాతిరెడ్డి వెంకటరెడ్డి, వేణునాథరెడ్డి, భాస్కర్, గురుస్వామిరెడ్డి, గోపీ చౌదరి, మునీంద్ర యాదవ్, లోకేష్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నగొట్టిగల్లులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు





ఎర్రావారిపాళెంలో ..



చంద్రగిరి: వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

పారిశుద్ధ్యం మెరుగు పరచండి



మధురానగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: పట్టణంలోని మధురానగర్‌లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి మెరుగు పరచాలని సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సోమవారం మధురానగర్‌లో సీపీఎం నేతలు పర్యటించి, అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో పొంగి పొర్లుతున్న అండర్ డ్రైనేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సీపీఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను గుర్తించిన సీపీఎం నేతలు వెంటనే మున్సిపల్ డీఈ, శానిటేషన్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మధురానగర్‌లోని పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కె.వేణుగోపాల్, ఎం.మాధవ్, పి.బుజ్జి, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

శేష వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి శేషవాహనాన్ని ఉత్సవర్లు అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. పరివార దేవతలకు నిత్య కైంకర్యాలను పూర్తి చేసి నైవేద్యం సమర్పించారు. చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం స్వామివారు శేష వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. కార్యక్రమాలను స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. స్వామివారు మంగళవారం రాత్రి నంది వాహనంపై దర్శనం ఇవ్వనున్నారు.

భూమిపై కౌలు రైతులకు హక్కులు ఉండవు

సత్యవేడు: కౌలు రైతులు పొందే పంట సాగు హక్కు పత్రాల్లో(సీసీఆర్‌సీ) భూమిపై ఎటువంటి హక్కులు ఉండవని, భూ యజమానులు ఆందోళన చెందాల్సిన పనిలేదని తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి భూ యజమాని కూడా కౌలు రైతులకు వారు సాగు చేస్తున్న భూమికి సాగుదారు హక్కు పత్రం ఇవ్వాలని తహసీల్దారు కోరారు. కౌలు రైతులు ఈ రుణ అర్హత కార్డు ద్వారా పంట రుణం, విత్తనాలు సబ్సిడీ, పంట నష్టపరిహారం, పంట బీమా మాత్రమే పొందగలుగుతారని చెప్పారు. భూమిపై కౌలు రైతులకు ఎటువంటి స్వాధీన హక్కుగానీ, ఇతర హక్కులు పొందలేరని స్పష్టం చేశారు. భూమిపై సర్వ హక్కులు యజమానికే ఉంటాయన్నారు. ఈఏడీఏ మాట్లాడుతూ మండలంలో 130 మందికి తగ్గకుండా కౌలు రైతులకు సాగు పత్రాలు అందజేయాలని సూచించారు. 11 నెలలు మాత్రమే ఈ కార్డు చెల్లు బాటు అవుతుందన్నారు.

కైలాసనాథునికి వెండి ఆభరణాలు

నారాయణవనం: మండలంలోని కైలాసనాథునికి తిరుపతికి చెందిన భక్తులు రూ.12 లక్షల విలువైన వెండి ఆభరణాలను అందజేశారు. సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో దాతలు ఆభరణాలను ఆలయ అర్చకులకు అందజేశారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్, వెంకట్, నాగేశ్వర్ రెడ్డి, సాయి గీత, సుగుణాకర్ రెడ్డి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి చక్రవర్తిని అందలం ఎక్కిస్తే అడ్డుకుంటాం

తిరుపతి సిటీ: అవినీతి చక్రవర్తిగా పేరుగాంచిన జానకి రామయ్యను ఇన్‌చార్జ్ వీసీగా నియమిస్తే పెద్దఎత్తున పోరాటం చేసి అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరుప్రతిష్టలు గల వర్సిటీలో 2019లో రెక్టార్‌గా ఆయన పని చేసిన కాలంలో బీఈడీ, డిగ్రీ కళాశాలల నుంచి పెద్దఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలతో ఏఐఎస్ఎఫ్ పోరాటం చేసిందని తెలిపారు. విద్యార్థి సంఘం పోరాటంతోనే అప్పటి వీసీ రాజేంద్రప్రసాద్ ఆదేశాలతో రెక్టార్ పదవికి జానకిరామయ్య రాజీనామా చేశారన్నారు. మరోసారి ఆయనను కూటమి ప్రభుత్వం ఇన్‌చార్జ్ వీసీగా జానకిరామయ్యను నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం అందుతోందని, అదే జరిగితే మాత్రం విద్యార్థి సంఘాలు ఏకమై పోరాటం చేస్తామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాల్సిందే



పూల మొక్కల్లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గం చూపాల్సిందేనని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అధికారులకు సూచించారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆమె స్వీకరించారు. ముఖ్యంగా యూడీఎస్ మ్యాన్‌హోల్ ఓవర్‌ఫ్లో, రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలని, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని, కాలువల్లో వ్యర్థాలు తొలగించాలని ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం మార్గాన్ని చూపించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులదే అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో మెరుగైన శానిటేషన్ అమలు చేయాలని, తరచూ కాలువల్లో బ్లీచింగ్ పిచికారీ చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రార్థన తీవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, డీసీపీ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి,, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్ వర్మ, సేతు మాధవ్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

తిరుపతి నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్‌తో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎవరికి వారు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. మురుగు కాలువల్లో నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్, ఆయిల్‌బాల్స్ పిచికారీ చేయించాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్‌కు సూచించారు. డీఈ తేజ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.